ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 21.04.2024 సమయం: 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ ప్రక్రియకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది.
2. లోక్ సభ ఎన్నికలకు కాంగ్రెస్, బిజెపి, బి.ఆర్.ఎస్ పార్టీలు ప్రచారాన్ని ఉధృతం చేశాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సాయంత్రం భువనగిరిలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు.
3. తెలంగాణ ఇంటర్మీడియెట్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాలను ఈనెల 24వ తేదీన ప్రకటిస్తారు.
4. అకాల వర్షాల వల్ల రాష్ట్రంలో పంట నష్టం జరిగిన ప్రాంతాలను వెంటనే సందర్శించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.
5. రాష్ట్రంలో అకాల వర్షాలు మరో వారం రోజుల పాటు కొనసాగుతాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

పోస్టల్ బ్యాలెట్

లోక్సభ ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ ప్రక్రియకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నద్ధం అవుతోంది. సాధారణ పోలింగ్ తేదీ కన్నా నాలుగు రోజుల ముందుగానే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఎన్నికల విధుల్లో భాగస్వాములయ్యే ఉద్యోగులు, కేంద్ర సర్వీసుల్లో పని చేసే సిబ్బంది, దివ్యాంగులు, 85 సంవత్సరాలు దాటిన వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం వెసులుబాటు ఇచ్చింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు రెండో దఫా శిక్షణ సందర్భంగా ఏర్పాటు చేసే ఫెసిలిటీ కేంద్రంలో ఓటు వేసేందుకు అవకాశం కల్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ పత్రాల ముద్రణ ను ఆయా జిల్లాల లోనూ, ఈవీఎం యంత్రాలపైన ఉంచే బ్యాలెట్ పత్రాలను హైదరాబాద్ లోనూ ముద్రించాలని అధికారులు నిర్ణయించారు. **లోక్ సభ** ఎన్నికలకు సుమారు 13 లక్షల పోస్టల్ బ్యాలెట్ పత్రాలను ముద్రించాలని అధికారులు అంచనా వేస్తున్నారు. 85 సంవత్సరాలు దాటిన వారు రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 4 లక్షల 50 వేల మంది ఉన్నట్లు అంచనా. దివ్యాంగ ఓటర్లు సుమారు 5 లక్షల మంది నమోదయ్యారు. ఎన్నికల విధుల్లో సుమారు 2 లక్షల 60 వేల మంది ఉద్యోగులు భాగస్వాములు కానున్నారు. రాష్ట్రానికి చెందిన 15 వేల మందికిపైగా సిబ్బంది ఇతర రాష్ట్రాల్లో విధులు నిర్వహిస్తున్నారు. వారికి రిజిస్టర్ పోస్టు ద్వారా పోస్టల్ బ్యాలెట్ పంపుతారు. పోస్టల్ బ్యాలెట్ కోసం దివ్యాంగులు, వయోవృద్ధులు 12డీ దరఖాస్తు ఫారం నింపి రిటర్నింగ్ అధికారికి అందించాల్సి ఉంటుంది.

(DESK)

రేవంత్

లోక్ సభ ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోరుగా ప్రచారం సాగిస్తున్నారు. ఇప్పటికే మహబూబ్ నగర్, మహబూబాబాద్, మెదక్ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించిన రేవంత్ రెడ్డి ఈ రోజు భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం

ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. రేవంత్ రెడ్డి  సాయంత్రం నాలుగు గంటలకు భువనగిరి పట్టణంలో రోడ్ షో నిర్వహించనున్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా కార్నర్ మీటింగ్ లో మాట్లాడతారు. పార్లమెంట్ అభ్యర్థి సామల కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి భువనగిరి లోని హైదరాబాద్ చౌరస్తా నుండి వినాయక చౌరస్తా వరకు రోడ్ షోలో పాల్గొంటారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పార్లమెంట్ ఇన్చార్జ్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు రేవంత్ రెడ్డి పర్యటనలో పాల్గొంటారు.

(STRINGER)

ప్రచారం బిజెపి

రాష్ట్రంలో అధిక లోక్ సభ స్థానాలను కైవసం చేసుకోవాలని పట్టుదలతో వున్న భారతీయ జనతాపార్టీ మొత్తం 17 నియోజకవర్గాల్లో ప్రచార వేగాన్ని పెంచింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తను పోటీ చేస్తున్న సికింద్రాబాద్ స్థానంతో పాటు, ఇతర నియోజకవర్గాల్లో కూడా పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్నారు. ఈ నెల 25వ తేదీన నామినేషన్ల ఘట్టం ముగిసిన తర్వాత, ప్రధాని మోదీతో పాటు, పార్టీ జాతీయ అగ్రనేతలను రాష్ట్రంలో ప్రచారానికి రప్పించేలా బిజెపి వ్యూహం రూపొందిస్తోంది. బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ప్రచారానికి రప్పించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

డెస్క్

బి ఆర్ ఎస్

భారత్ రాష్ట్ర సమితి కూడా ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేస్తోంది. పార్టీ అధినేత  కె చంద్రశేఖర రావు బుధవారం నుంచి రోడ్ షోలు నిర్వహించనున్నారు. ఇప్పటికే కరీంనగర్, చేవెళ్ల, మెదక్ బహిరంగ సభల్లో పాల్గొన్న ఆయన ఈ నెల 24 వ తేదీన మిర్యాలగూడ నుంచి బస్సు యాత్ర చేపట్టనున్నారు. లోక్సభ నియోజకవర్గాల వారీగా రోడ్ షోలు నిర్వహిస్తారు.

ఒక్కో నియోజకవర్గంలో మూడు, నాలుగు ప్రాంతాల్లో చంద్రశేఖర రావు రోడ్ షో లు నిర్వహిస్తారు. మే 10న సిద్దిపేటలో ఈ బస్సు యాత్ర ముగుస్తుంది

(DESK)

నామినేషన్స్

రాష్ట్రంలో లోక్ సభ ఎన్నికల నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. గత మూడు రోజుల్లో మొత్తం 164 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ రోజు ఆదివారం నామినేషన్ల స్వీకరణకు ఎన్నికల సంఘం సెలవు ప్రకటించింది. తిరిగి రేపటి నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుంది. 26వ తేదీన నామినేషన్లను పరిశీలిస్తారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు 29వ తేదీతో ముగుస్తుంది.

డెస్క్

నిజామాబాద్- ప్రొఫైల్

అంతర్రాష్ట్ర సరిహద్దులు, విభిన్న సంస్కృతీ సంప్రదాయాలు తో పాటూ వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు బలంగా ఉన్న లోక్ సభ నియోజక వర్గాల్లో నిజామాబాద్ ఒకటి. బోధన్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ, కోరుట్ల ,జగిత్యాల శాసనసభ స్థానాలు నిజామాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలో ఉన్నాయి. నిజామాబాద్ లోక్ సభ నియోజకవర్గం ముఖచిత్రం పై మా విలేకరి మహదేవ్ అందిస్తున్న నివేదిక:

*Voicecast:*

పసుపు బోర్డ్ కోసం 186 మంది రైతులు ఎన్నికల లో పోటీ చేసి లక్ష ఓట్లు సాధించటంతో గత ఎన్నికల్లో యావత్ దేశం దృష్టి నిజామాబాద్ పడింది. రాష్ట్రంలో జనాభా పరంగా మూడో అతిపెద్ద నగరం. ఒక్క రిజర్వడ్ సెగ్మెంటు కూడా లేని జనరల్ స్థానం. తెలంగాణ ఏర్పడ్డాక 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఈ స్థానాన్ని TRS గెలుచుకోగా, గత 2019 ఎన్నికల్లో ఈ స్థానంపై

BJP అభ్యర్థి ధర్మపురి అరవింద్ విజయం సాధించారు. దీర్ఘకాలంగా ఉన్న డిమాండు మేరకు కేంద్రం పసుపు బోర్డు ప్రకటించింది. ఇందుకోసం కృషి చేసిన BJP, సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోటానికి మళ్ళీ ధర్మపురి అరవింద్ ను బరిలోకి దింపింది. నిజామాబాద్ పై పట్టు కోసం కాంగ్రెసు పార్టీ శాసనమండలి సభ్యులు జీవన్ రెడ్డి ని పోటీకి దింపగా, BRS మాజీ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ ను పోటీకి నిలబెట్టింది. మూడు ప్రధానపార్టీల సీనియర్ నాయకులూ తలపడుతూండటంతో నిజామాబాద్ లో త్రిముఖ పోటీ అనివార్యం అయింది. మరోవైపు ఈ స్థానం కోసం పలువురు ఆశావహుల నామినేషన్లు దాఖలు చేస్తున్నారు.ఇంతవరకు పలువురు స్వతంత్రులతోపాటూ, ధర్మసమాజ్ పార్టీ, విద్యార్థుల రాజకీయ పార్టీ , బహుజన్ ముక్తి పార్టీ లాంటి ఇతర పార్టీల నూంచి కూడా నామినేషన్లు దాఖలయ్యాయి. ఇటీవలి శాసన సభ ఎన్నికల్లో 3 శాసనసభ సెగ్మెంట్లను BRS గెలుచుకోగా కాంగ్రెసు, BJP రెండేసి స్థానాలు గెలుచుకోవటంతో లోక్ సభ స్థానంపై విజయాన్ని మూడు ప్రధానపార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఆయా పార్టీల అగ్రశ్రేణి నాయకులూ క్షేత్ర స్థాయి ప్రచారంపై దృష్టి పెట్టారు.

PTC, Jagityal మహదేవ్

ఇంటర్మీడియట్

తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాలను ఈ నెల 24 వ తేదీన ప్రకటిస్తారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు ఇంటర్మీడియట్ ఫలితాలను విడుదల చేయనున్నట్టు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. మొదటి, రెండో సంవత్సర ఇంటర్ పరీక్ష ఫలితాలను అధికారులు ఒకేసారి విడుదల చేస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం వల్ల ఎన్నికల సంఘం అనుమతి తోనే అధికారులు ఫలితాలను వెల్లడించనున్నారు. కాగా, పదవ తరగతి పరీక్షా ఫలితాలను ఈనెల 30న లేదా వచ్చే నెల 1న విడుదల చేస్తారు. పదవ తరగతి ప్రశ్న పత్రాల మూల్యాంకనం నిన్నటి తో పూర్తయింది.

(DESK)

మహావీర్ జయంతి

భగవాన్ మహావీర్ జయంతిని ఈరోజు జైనులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. మహావీర్ ప్రబోధించిన సత్యం, అహింస, శాంతి సందేశాలను స్మరించుకుంటూ ఆయనకు నివాళులర్పిస్తున్నారు. తెలంగాణాలో ఈరోజు భగవాన్ మహావీర్ జయంతి సందర్భంగా నాన్ వెజ్ డేను పాటిస్తున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో మాంసం దుకాణాలు మూసివేశారు. హైదరాబాద్ మహావీర్ ఆసుపత్రిలో ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

డెస్క్

వర్షాలు

తెలంగాణ వ్యాప్తంగా అకాల వర్షాలు మరో వారం రోజుల పాటు కొనసాగుతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. సిరిసిల్ల, కరీంనగర్, భద్రాద్రి, హన్మకొండ, కామారెడ్డి, మహబూబాబాద్, జగిత్యాల, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఈరోజు వడగళ్ల వానలు పడే అవకాశం వుందని వాతావరణ కేంద్రం పేర్కొంది. పలుచోట్ల 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం వుంది.

డెస్క్

పంట నష్టం

రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు, వడగళ్ల వానల వల్ల పంట దాదాపు 2 వేల 200 ఎకరాల లో వరి, మొక్కజొన్న, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. నారాయణపేట, కామారెడ్డి, నిజామాబాద్, నాగర్ కర్నూల్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక నివేదికలు అందాయని

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పంట నష్టం సంభవించిన ప్రాంతాలను వెంటనే సందర్శించాలని , పూర్తి స్థాయిలో పంట నష్టపోయిన రైతుల వివరాలు వెంటనే సేకరించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. వరి పంట కోతలు ఊపందుకున్న నేపథ్యంలో వచ్చే రెండు, మూడు వారాల పాటు రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

(DESK)

గీత కార్మికులు

రాష్ట్రవ్యాప్తంగా గీత కార్మికులు కష్టాలలో ఉన్నారని, వారిని ఆదుకోవాలనే ఆలోచన ప్రభుత్వానికి లేకుండా పోయిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని తాడూరు గ్రామం లోకాలిపోయిన తాటి చెట్లను పరిశీలించారు.

(PTC)

వరంగల్

ఓటర్లను ప్రభావితం చేసే డబ్బు, మద్యం తరలింపు పై అధికారులు దృష్టి సారించాలని వరంగల్ పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు ఏ దిలీబన్ సూచించారు. నిబంధనల మేరకే మద్యం విక్రయాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. చెక్ పోస్ట్ ల వద్ద పకడ్బందీగా వాహనాలను తనిఖీ చేయాలన్నారు.

(PTC)

నల్లగొండ

లోకసభ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు మీడియా, సోషల్ మీడియాల లో రాజకీయ ప్రకటనల ప్రచారం కోసం తప్పనిసరిగా మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ నుంచి ముందస్తు అనుమతిని తీసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్, నల్గొండ పార్లమెంటు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన తెలిపారు.

(PTC)

ఖమ్మం

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ఖర్చుల లెక్కలు పకడ్బందీగా నమోదు చేయాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాత్ కృష్ణస్వామి, శంకరనంద్ మిశ్రా సూచించారు. ఖమ్మం కలెక్టరేట్ లో సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ బృందాలకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు.

(PTC)